నమస్తే తెలంగాణ

# మెదక్

I | హైదరాబాద్, శుక్రవారం 12 ఏప్రిల్ 2024 | MEDAK




మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, పక్కన ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

# కేసీఆర్ హయాంలో కరువు దూరం

- మోసాలు చేసే కాంగ్రెస్‌కు ఎలా ఓటేస్తారు..
- ఢిల్లీకి గులాం గిరీ చేసేవాళ్లు మనకెందుకు..
- వెంకట్రామిరెడ్డి గెలుపు మనకు చాలా ముఖ్యం...
- మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- సేవచేసే అవకాశం రావడం అదృష్టం
- పేద పిల్లల కష్టం తీర్చేలా.. రూ.100 కోట్లతో ట్రస్ట్ ఏర్పాటు
- ప్రతి నియోజకవర్గంలో 2 కోట్లతో అన్ని హంగులతో ఫంక్షన్ హాల్ నిర్మిస్తా
- మెదక్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి
- చిన్నకోడూరు మండలం పెద్దకోడూరులో మెదక్ పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశం

## కాంగ్రెస్ వచ్చి.. కరువు తెచ్చింది... జైతెలంగాణ అనని వ్యక్తి రేవంత్ సీఎం కావడం మన దురదృష్టం



సిద్దిపేట జిల్లా పెద్దకోడూరులో మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, పక్కన మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

చిన్నకోడూరు, ఏప్రిల్ 11: 'గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కరువు ఏర్పడితే మూగజీవాలు పశుగ్రాసం దొరకక కబేళాలకు వెళ్లాయి. పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేసి పశువులను బతికించుకోవాలని ఆంధ్ర ప్రాంతాల నుంచి గడ్డి తీసుకొచ్చి మూగ జీవాలను బతికించుకున్నాం'.. అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం పెద్దకోడూరులో బుధవారం మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ, ఎంపీపీ మాణిక్య రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపు చాలా ముఖ్యమన్నారు. కాంగ్రెస్ పాలన ఏ పాటిదో ప్రజలకు అర్థమైందన్నారు. వైఎస్ ఉన్నప్పుడు ఆరు గంటల కరెంటు ఇస్తే, రూ.90 వేల కోట్లు ఖర్చు చేసి కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇచ్చారన్నారు. కేసీఆర్ హయాంలో రైతుల సాగు నీటి కష్టాలు తొలిగాయన్నారు. అప్పుడు నిండుకుండాలా ఉన్న జలాశయాలు, ఇప్పుడు ఎండిపోయి దర్శనమిస్తున్నామని తెలిపారు. సీఎంగా కేసీఆర్ కాలు పెడితే పదేండ్లు కరువు లేదన్నారు. కాంగ్రెస్ వచ్చి.. కరువు తెచ్చిందన్నారు. ఏ ఒక్క హామీని కాంగ్రెస్ నెరవేర్చలేదన్నారు. మీరు బీఆర్‌ఎస్‌కు ఎంపీ సీట్లు ఇస్తే హామీలపై కాంగ్రెస్‌ను నిలదీస్తామన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు మనకు నష్టం చేశారన్నారు. ఉప ఎన్నికలో అనేక హామీలు ఇచ్చి అరచేత వైకుంఠం చూపారని తెలిపారు. దుబ్బాకలో చెల్లని వ్యక్తి ఇక్కడ ఎలా చెల్లుతాడన్నారు. ఎన్నడూ జైతెలంగాణ అనని రేవంత్‌రెడ్డి సీఎం అవ్వడం మన దురదృష్టమన్నారు. జైతెలంగాణ అనే వాళ్లను కాల్చి పడేస్తా అన్నాడని గుర్తుచేశారు. గోదావరి నీళ్లు వచ్చి పంటలు పండితే ముద్ద తింటున్నామని, ఇంటింటా తిరిగి ప్రజలకు వాస్తవాలు చెప్పాలన్నారు. నోటి కాడి బుక్క పోగొడుతున్నారు. నిజమైన రైతునేస్తం కేసీఆర్ మాత్రమేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. మోసాలు చేసిన కాంగ్రెస్‌కు ఎలా ఓటు వేస్తారని, మనం మోసపోకుండా మేలుకోవాలని చెప్పారు. మెదక్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి పేద విద్యార్థుల చదువు కోసం రూ.వంద కోట్లతో ట్రస్ట్ ఏర్పాటు చేస్తారన్నారు. కార్యకర్తలు పేదల ఇండ్లలో పెండ్లిండ్లు అయితే ఉచిత ఫంక్షన్ హాల్ సేవలు ప్రకటించారని, 30 రోజులు కష్టపడితే అందరం కలిసి ఇక్కడి ప్రాంత అభివృద్ధికి పాటుపడదామన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. గులాబీ జెండా కప్పుకున్నవాళ్లే ఢిల్లీలో జైతెలంగాణ అంటారని, గులాం గిరీ చేసేవాళ్లు మనకెందుకన్నారు. సన్నాహక సమావేశంలో పాల్గొన్న నాయకులు కార్యకర్తలకు ఎమ్మెల్యే హరీశ్‌రావు స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, సొసైటీ చైర్మన్లు కనకరాజు సదానందంగౌడ్, వైస్ ఎంపీపీ పాపయ్య, మెదక్ ఉమ్మడి జిల్లా గొర్లకాపరుల మాజీ అధ్యక్షుడు శ్రీ హరి యాదవ్, సీనియర్ నాయకులు బాల్‌రెడ్డి, రామచంద్రం, బీఆర్‌ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు గుండెలి వేణు, బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు రాజు, ఎంపీటీసీలు, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెద్దకోడూరులో కార్యకర్తలకు భోజనం వడ్డిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

## సేవచేసే అవకాశం రావడం అదృష్టం

**మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి**



సుదీర్ఘకాలంగా ఎక్కడైతే కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించానో.. అక్కడే పేదలకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని మెదక్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు సహకారంతో, మీ అందరి ఆశీస్సులతో గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించి, ఇక్కడి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతానన్నారు. అధికారిగా మీ అందరికీ సేవలు అందించానని, ఇక మీదట ఎంపీగా ప్రజలకు సేవ చేస్తానన్నారు. ఇక్కడి ప్రజల కష్టం, సుఖం తెలుసు. నా చివరి శ్వాస వరకూ ప్రజా సేవలో ఉంటానన్నారు. విద్యకు ప్రాముఖ్యత ఇచ్చి పేద పిల్లల కష్టం తీర్చేలా రూ.వంద కోట్లతో ట్రస్ట్ ఏర్పాటు చేస్తానన్నారు. ప్రజా జీవితంలో ఉన్నా నేను పెద్ద రాజకీయ నాయకుడిని కాదని, మీలో ఒకడిగా ఉంటానన్నారు. నాకు ప్రజలకు మంచి చేయడమే తెలుసన్నారు. గెలిచిన 30 రోజుల్లో ట్రస్ట్ ఏర్పాటు చేస్తాను. 15 రోజుల్లో ట్రస్ట్ రిజిస్ట్రేషన్ చేస్తానన్నారు. దీంతోపాటు నియోజకవర్గానికి ఒక ఫంక్షన్ హాల్ నిర్మిస్తానన్నారు. కార్యకర్తలు, పేదలకు ఉచితంగా సేవలు అందిస్తామన్నారు. కార్యకర్తలకు తప్పకుండా ప్రాధాన్యం ఇస్తామన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి మంచి ఉద్యోగాలు సాధించేలా కృషి చేస్తానని, మంచి మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



పెద్దకోడూరులో సన్నాహక సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

# ఘనంగా ఈద్-ఉల్-ఫితర్

**ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి హరీశ్‌రావు**



సిద్దిపేటలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 11 : సిద్దిపేటలో 20ఏండ్లుగా ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా ముస్లింలను అలయ్‌బలయ్ చేసుకోవడం ఆనవాయితీగా వస్తున్నదని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గురువారం ఎక్బాల్‌మినార్ వద్ద ఈద్గా మైదానంలో ప్రార్థనలు నిర్వహించిన అనంతరం మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, కడవేర్గు రాజనర్సులతో కలిసి వేడుకల్లో పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ మీ జీవిత ఆశయాలు నెరవేరేలా అల్లా ఆశీర్వదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. శాంతి, ప్రేమ, పవిత్ర సంకల్పానికి చిహ్నం రంజాన్ అన్నారు. ఈ రోజు ముస్లింలతో కలిసి పండుగలో పాలుపంచుకున్నందుకు ఎంతో సంతోషంగా ఉన్నదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, నాయకులు పాల సాయిరాం, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు మల్లికార్జున్, మోయిజ్, ఆక్తర్‌పటేల్, మెహన్‌లాల్, సికిందర్, కోఆప్షన్ సభ్యుడు మేర సత్తయ్య, జావిద్, రజనీకాంత్‌రెడ్డి, రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మేర్గు మహేశ్, మరుపల్లి శ్రీనివాస్ గౌడ్, ఇర్షాద్ హుస్సేన్, జువ్వన్న, కనక రాజు, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

# మీ కష్టసుఖాల్లో తోడుంటా..

**బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి**



కుకునూరుపల్లిలో బీఆర్‌ఎస్ నేతలతో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 11: మీ కష్టసుఖాల్లో తోడుంటానని బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి గజ్వేల్ నుంచి సిద్దిపేటకు వెళ్తూ మార్గమధ్యలో కుకునూరుపల్లి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మెదక్ ఎంపీ అభ్యర్థిగా నిలిపారని, ప్రజలు, నాయకులు, కార్యకర్తల ఆశీర్వాదంతో గెలిచి మరింత సేవ చేస్తానన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, పీఎన్‌ఆర్ ట్రస్ట్ అధినేత పోల్కంపల్లి నరేందర్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ అమరేందర్ తదితరులు ఉన్నారు.

# ఎంపీగా వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

**ఎన్నికల ప్రచార రథాలను ప్రారంభించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**



ప్రచార రథాలకు జెండాఊపి ప్రారంభిస్తున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, ఏప్రిల్ 11: మెదక్ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. గురువారం పట్టణ పరిధిలోని పోతిరెడ్డిపల్లి సంగమేశ్వరాలయంలో ఎన్నికల ప్రచార రథాలకు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారిగా పనిచేసి వెంకట్రామిరెడ్డిని ప్రజలకు సేవచేయాలనే ఉద్దేశంతో పార్లమెంట్ బరిలో నిలిపిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో సంయుక్త కలెక్టర్‌గా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందారని గుర్తుచేశారు. నాలుగు మండలాలు, రెండు మున్సిపాలిటీల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తాయన్నారు. పేదల సంక్షేమం, అభ్యున్నతికి చిత్తశుద్ధి కలిగిన మానవతావాది వెంకట్రామిరెడ్డి అని, పీవీఆర్ ట్రస్టుతో పేదలకు విద్యనందించే గొప్ప మనస్సుకు ప్రజలందరి మద్దతు ఉంటుందన్నారు. సంగారెడ్డి నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్‌చైర్మన్ పట్నం మాణిక్యం, నాయకులు నరహరిరెడ్డి, కాసాల బుచ్చిరెడ్డి, చీల మల్లన్న, పెరుమాళ్ల నర్సింహులు, కాసాల రాంరెడ్డి, విఠల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

# వేంకటేశ్వరాలయంలో మంత్రి పూజలు



టేక్మాల్, ఏప్రిల్ 11: మండలంలోని ధనూర గ్రామ శివారులోని వేంకటేశ్వరాలయంలో గురువారం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే పూజల్లో మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. కార్యక్రమంలో నిమ్మ రమేశ్, మాన్ కిషన్, పాపయ్య, సాగర్, కిశోర్ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

# మహాత్మా జ్యోతిబాపూలే చిరస్మరణీయుడు

- జయంతి వేడుకల్లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 11: సామాజిక తత్వవేత్త, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబాపూలే చిరస్మరణీయుడని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గురువారం జ్యోతిబాపూలే 198వ జయంతిని పురస్కరించుకొని సిద్దిపేట పట్టణంలోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ జ్యోతిబాపూలే బడుగు, బలహీన వర్గాల కోసం చేసిన పోరాటం, ఆశయాలు, కార్యాచరణ నేటికీ స్ఫూర్తిదాయకమన్నారు. వివక్షలేని సమాజం కోసం జీవితాంతం శ్రమించిన గొప్ప సామాజిక తత్వవేత్త అన్నారు. ఆయన ఆశయాలు, ఆశలకు అనుగుణంగా అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పాలన కొనసాగిందన్నారు. మహనీయులు డా. బీఆర్.అంబేద్కర్, జ్యోతిబాపూలే, బాబు జగ్జీవన్‌రామ్ కన్న కలలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిజం చేసిందన్నారు. మహిళలకు గురుకుల విద్యతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. వెనకబడిన వర్గాల విద్యాభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థను ఏర్పాటు చేసి, అన్ని నియోజకవర్గాల్లో బీసీ గురుకులాలు నెలకొల్పినట్లు హరీశ్‌రావు తెలిపారు. బలహీనవర్గాల విద్యార్థుల కోసం పూలే బీసీ విదేశీ విద్యానిధి పథకం కింద ఒక్కొక్కరికీ రూ.20 లక్షల వరకు ఆర్థిక సాయం అందజేసినట్లు చెప్పారు. గ్రామాల్లోని కులవృత్తులను బలోపేతం చేసేందుకు వృత్తులవారీగా ప్రోత్సాహకాలు అందించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి, బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, బాల సాయిరాం, మారేడ్ రవీందర్ రెడ్డి, పూల బాలకృష్ణారెడ్డి, శ్రీనివాస్, నర్సింహులు మెరుగు మహేశ్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

**నేటి సమాజానికి స్ఫూర్తి జ్యోతిబా పూలే: కలెక్టర్ రాహుల్ రాజ్**

మెదక్, ఏప్రిల్ 11(నమస్తే తెలంగాణ): మహిళలకు సమాజంలో సమాన అవకాశాల కోసం కృషి చేసిన జ్యోతిబాపూలే నేటి సమాజానికి స్ఫూర్తి అని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో పూలే జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సహాయ సంక్షేమ అధికారి నాగరాజుగౌడ్, తెలంగాణ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్, టీఎన్జీవోస్ జనరల్ సెక్రెటరీ రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనురాధ, వసతి గృహ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మెదక్‌లో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

## భారీగా రేషన్ బియ్యం పట్టివేత

తూప్రాన్, ఏప్రిల్ 11 : మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో వేర్వేరు ఘటనలో 28.25 టన్నుల రేషన్ బియ్యాన్ని తూప్రాన్ పోలీసులు పట్టుకుని పౌర సరఫరాల శాఖకు అప్పగించారు. తూప్రాన్ ఎస్సై శివానందం ఆధ్వర్యంలో గురువారం ఉదయం తూప్రాన్ మున్సిపల్ పరిధి అల్లాపూర్ టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా, హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ తరలిస్తున్న 28 టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. లారీలో బియ్యం తరలిస్తున్న భాస్కర్‌రెడ్డి, చింటయ్య, డ్రైవర్ నీరజ్ కుమార్‌పై కేసు నమోదు చేశారు. మరో ఘటనలో 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం లోడుతో వెళ్తున్న ఆటోను పోలీసులు పట్టుకుని, ఆటో ఓనర్ తేజావత్ రవి, డ్రైవర్ బాలాజీపై కేసు నమోదు చేశారు. మొత్తం 28.25 టన్నుల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి పీడీఎస్ తూప్రాన్ ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దార్ ప్రణీత సమక్షంలో పంచనామా నిర్వహించి పౌర సరఫరాల శాఖకు అప్పగించినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.



పట్టుబడిన రేషన్ బియ్యం లారీతో నిందితుడు నీరజ్ కుమార్

## ఆర్థిక ఇబ్బందులతో కౌలురైతు ఆత్మహత్య



ఏసయ్య(ఫైల్)

పాపన్నపేట, ఏప్రిల్ 11: మెదక్ జిల్లా పాపన్నపేట మండలం కుర్తివాడ గ్రామంలో ఆర్థిక ఇబ్బందులతో కౌలురైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పాపన్నపేట ఎస్సై నరేశ్ వివరాల ప్రకారం.. కుర్తివాడ గ్రామానికి చెందిన ఉబ్బి ఏసయ్య(44) గ్రామంలో ఏడాదిగా ఇతరుల పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ఆశించిన దిగుబడులు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. దీనికి తోడు ఇటీవల పెద్ద కుమారుడు లక్ష్మణ్‌కు ఇంట్లో పాముకాటు వేయడంతో చికిత్స నిమిత్తం మరిన్ని అప్పులు చేయాల్సి వచ్చింది. సుమారు రూ.5 లక్షల వరకు అప్పులు కావడంతో తరుచూ బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో మనస్తాపం చెందిన ఏసయ్య బుధవారం అర్ధరాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా హాల్‌లో ఉన్న కిటికీకి లుంగీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం తెల్లవారుజామున కుటుంబీకులు నిద్ర లేచి చూసేసరికి విగతజీవిగా కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం మెదక్ దవాఖానకు తరలించారు. భార్య కాశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య కాశమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.